కొత్త వెలుగు

స్వరూప్ సిన్హా

సంధ్యావాలి చాలాసేపయింది. గుట్టమీదుండే పురాతనమైన ఆ అమ్మవారి దేవాలయం లోకి జనం ఇంకా వస్తూనే ఉన్నారు. అవి జాతర రోజులు కాబట్టి ఊళ్ళోని జనమంతా ఆ కోవెల్లోనే పోగయినట్టు అగుపిస్తున్నారు! కాసేపటికి ''తప్పుకోండి, తప్పుకోండి!'' అని కేకలేసుకుంటూ, పెట్రోమాక్సు లైట్లూ, మంగళవాద్యాలూ. వీటి మధ్యన బోయీలు కొందరు అమ్మవారి పల్లకీ మోసుకొంటూ మెట్లెక్కి వచ్చారు. జనసందోహం రెండుగా చీలి పల్లకీ వెళ్ళేందుకు దారి ఏర్పడింది. దాన్ని మోసుకొచ్చిన వారిలో పదహారేళ్ల పడుచువాళ్ళ మొదలుకొని, యాభై పైబడిన వృద్ధుల దాకా... అన్ని వయసుల మగాళ్ళూ ఉన్నారు. వాళ్లంతా ఉదయమే టౌను కెళ్లిపోయి కూలీనాలీ చేసుకొచ్చే జనం. వారం లోని ఒక రెండు రోజుల్లోను, ఇలాంటి పండగ దినాల్లోనూ అమ్మవారిని ఊరేగించుకొస్తే వాళ్లకి పూజారిచ్చే ప్రసాదం— అరటిపళ్ళూ, కొబ్బరిముక్కలూ, పటికబెల్లం వగైరాల్లాటివి గిట్టుబాటవుతాయని ఆశ! సింహద్వారం దగ్గర పల్లకీని దింపేసి, చెమటలు దులుపుకుంటూ ఉసూరుమని అరుగుమీద చతికిలపడ్డారు వాళ్లు. ఆ తరువాత పూజారి దేవీ ప్రసాదాన్ని ఇవ్వడమే తడవుగా ఆత్రంగా అందుకుని తినసాగేరు.

''ఏరా అప్పలకొండా... ఇవాళ కోవెల శుభ్రం చేసే వంతు నీ పెళ్లానిదని తెలీదా? ఉదయం దాన్ని పంపకుండా... వెధవ్వు! నువ్వు మాత్రం ప్రసాదం తింటానికి ఠంచనుగా హాజరయ్యావు!'' పూజారి రామానుజం ఓ పాతికేళ్ల యువకుణ్ణి కోపంగా ప్రశ్నించాడు.

''నా యింటిదానికి ఒంట్లో బాగునేదు, ఉదయాన్నే మా సిట్టిదాన్ని పంపినాను గద పూజారయ్యా?'' అన్నాడా యువకుడు బుర్ర గోక్కుంటూ.

''మహా పంపేవులే ఆ గుంట ముండని! దానికన్నీసం నీళ్లు తోట్టమయినా చాతనయి చావలేదు. దుక్కలా గున్నావు! నువ్వు రాకూడదూ...? ఇదిగో... మీ అందరికీ ఇప్పుడే చెపుతున్నా, ఇలాంటి పండగ పబ్బాల్లో మీ ఆడాళ్లకి ఒళ్లు బాగాలేనప్పుడు, మీలో ఒక్కళ్లిద్దరు వచ్చి ఉదయమూ సాయంత్రమూ ఆలయం శుభ్రం చేసి వెళ్లాలి. పనీపాటా చేతగాని పిల్లవెధవల్ని పంపుతేమాత్రం కుదర్దు'' అనేసి పిలక సవరించుకొంటూ, తన భారీ శరీరాన్ని మోసుకుంటూ హడావుడిగా వెళ్లిపోయాడు నడివయస్కుడైన రామానుజం. అప్పటికే జనం 'క్యూ'లో నుంచుని అమ్మవారి దర్శనానికి ఎదురుచూస్తున్నారు.

''అబ్బాయ్ వంశీ! అర్చనకు ఏర్పాట్లు చేశావా లేదా...? త్వరగాకానీ మరి. ఇవ్వాళ జనాన్ని పంపేటప్పటికి ఏ పదకొండో దాటేట్టుంది...'' ఓ వైపు మంత్రాలు చదువుతూనే మరోవైపు వంశీతో మాట్లాడసాగేడు రామానుజం. వంశీకృష్ణ మౌనంగా హారతి పళ్లెం సిద్ధం చెయ్యసాగేడు. అతనికి సుమారు పాతికేళ్లుంటాయి. పూజారిగా అతనీ ఆలయాని కొచ్చి సుమారొకటి రెండు మాసాలు గడిచాయి. తనకంటే వయసులో, అనుభవంలో పెద్దవాడైన రామానుజం హడావిడిగా జరిపే పూజ తంతు చూస్తే వంశీకి విచిత్రంగా అనిపిస్తుంది. పూజకు ప్రాతిపదికలైన భక్తిభావం—ఏకాగ్రత—ధ్యానంలాటివి ఆ పూజారి పూర్తిగా విస్మరించినట్టుగా తోచేదతనికి. ఏదో మొక్కుబడి తీర్చుకున్నట్టు నాలుగు మంత్రాలో, దేవీస్తోత్రమో గడగడా చదివేస్తూ, ''నడవండి, నడవండి! అలా నుంచుని చూస్తారేం? ఇంకా మీ వెనకాల చాంతాడంత 'క్యూ' ఉంది.'' అని భక్తులను అదిలిస్తూ, మొత్తానికి కోవెలకొచ్చిన జనానికి 'హమ్మయ్య! దర్శనం అయింది.' అనిపించి పంపించేవాడు.

ఆ రాత్రి జాతర సందడి సర్దుమణిగి జనాన్ని పంపేటప్పటికి రామానుజం భయపడ్డట్టే పదిన్నర దాటింది. ఆయన హడావిడిగా ప్రసాదాన్ని మూటగట్టుకుని వెళ్లిపోయాడు, వంశీకృష్ణను తాళాలూ అవీ వేసుకుని వెనకాల రమ్మని చెప్పి. ఆ రాత్రివేళ ఆలయ ప్రాంగణమంతా నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంది. వెన్నెల్లో తెల్లగన్నేరుపూలు వెండిపూలలా మెరిసిపోతున్నాయి! చల్లటి గాలి ప్రాణానికి సేదదీరుస్తూంది. వంశీ గర్భగుడికి తాళం వెయ్యబోతూ ఒక్కమారు దేవి విగ్రహాన్ని తృప్తిగా చూసుకుని దణ్ణం పెట్టుకున్నాడు. దేవి చిరునవ్వులు చిందిస్తూ, చెయ్యెత్తి ఆశీర్వదిస్తున్న భావన అతనికి భక్తిపారవశ్యాన్ని కలిగించింది. ఆ నిర్మల వాతావరణంలో, అలాగే కన్నార్పకుండా ఆ దేవతామూర్తిని చూస్తూ గడిపెయ్యాలనిపించిందతనికి. కాసేపు గడిచాక నెమ్మదిగా తాళాలు వేసుకుని ప్రాకారం బయటి కొచ్చాడతను. కోవెల ప్రాంగణంలో ఎవరో నుంచున్నట్టనిపించిందతనికి. ''ఎవరదీ...?'' అన్నాడతను ఆ వ్యక్తిని పరీక్షగా చూస్తూ.

''నేను పూజారయ్యా! యాదిని...!'' ఓ చేత పూలమాలనూ, మరోచేత పసివాణ్ణీ పట్టుకుని బెరుగ్గా సమాధానమిచ్చింది యాది.

''ఏం యాదీ...! గుడి మూసేసాక వచ్చావు... అందునా ఇంత రాత్రప్పుడు?'' అన్నాడు వంశీ ఆశ్చర్యంగా.

''నాను అమ్మోర్ని సూడకుంటే మాత్తరం యేట్నేండి బాబూ! ఈ పూలు మీకిచ్చేసి పోదారని వచ్చాను. అమ్మోరి జాతరని ఊళ్లో అనుకుంటా ఉంటే తెలిసిందయ్యా'' అంటూ గులాబీ మాల అందించింది.

''వచ్చినప్పుడల్లా భలే చక్కటి పూలు పట్టుకొస్తావు! ఎక్కణ్ణించి తెస్తావు యాదీ?'' సిగ్గుపడింది యాది. నెమ్మదిగా చెప్పింది.

''నాను రోజా టౌనుకి దొరగారింట్లో పనికెల్తాను బాబూ! ఆ బాబు రోజా రెండు పూట్లా దేవుడి పూజ సేత్తారు. ఆ దేవుడికాడ యెట్టి తీసేసినయే ఈ పూలన్నీని! అమ్మగోరు యాడైనా పారేసి రమ్మంటారు. ఇయ్యి 'మైల' పూలని తెలుసు బాబూ. కానీ శుక్రవారాలూ, పండగ పొద్దులూ అమ్మోర్ని సూడటానికి ఉట్టి సేతుల్తో రాబుద్ధి పుట్టదయ్యా! పేదదాన్ని. ఇలాగ సేతికి దొరికిన పూలట్టుకొస్తుంటాను.'' ఆమె కళ్లలో అమాయకత ఉంది. ఆ కంఠంలో నిజాయితీ ఉంది.

''స్వచ్ఛమైన మనసుతో అర్పించినదానికి 'మైల' ఎక్కడిదసలు?'' అనిపించింది వంశీకృష్ణకు. మాల అందుకున్నాడు, 'ఎవరికి తెలుసు! ఈవేళ వచ్చిన అర్పణలన్నింటిలోకీ దేవికి ఈ పూలే యిష్టమవుతాయేమో!' అనుకున్నాడు.

''చాలాసార్లు గమనించాను. నీవొచ్చినపుడెల్లా తలుపు లేసేసాక వస్తావేం యాదీ? కాస్త పండగ రోజుల్లో అయినా ముందుగా వచ్చి అమ్మవార్ని చూడరాదా!'' అన్నాడతను చిర్నవ్వుతో... మాలను ద్వారానికి అలంకరిస్తూ.

''అమ్మో...! ఆ పెద్ద పూజారయ్య నన్ను గుళ్లోన సూస్తే సంపేస్తడు. నాను యానాది దాన్ని గందా! మీరు తలుపులేసుకెళ్లిపోయినా నానొచ్చి పూలు తలుపుకాడ యెట్టేసి దణ్ణాలెట్టేసుకుని యెల్లిపోతాగానీ గుడిలోకి రావడమే? ఓలమ్మో! నానలాగ రాకూడదు బాబూ. మీరు సిన్నోరు... కొత్తగొచ్చినారు, మీకు తెలవదు...'' అంది యాది. అప్రతిభుడయ్యాడతను. యాది అతనికి నమస్కరించి పిల్లాణ్ణెత్తుకుని వెళ్లిపోయింది. కొన్ని క్షణాల క్రితం ప్రశాంతంగా

ఉండిన అతని మనసిప్పుడు అల్లకల్లోలమై పోయింది.

* * *

''ఇంతాలస్యమైందేం...? భోంచేద్దురు గాని పదండి'' కాత్యాయిని చదువుతున్న పుస్తకాన్ని పడేసి లేచి నుంచుంది వంశీకృష్ణను చూసి.

''భోజనం అక్కర్లేదు కాత్యాయినీ, ఆకలిగా లేదు. కాసిని మజ్జిగ నీళ్లుంటే ఇవ్వు.'' అన్నాడతను అలసటగా పక్కమీద కూచుంటూ. కుండలోంచి మజ్జిగ వంపుకుని తెచ్చి గ్లాసతని చేతికందించి, ప్రక్కనే కూచుంది వీవనతో విసురుతూ. మజ్జిగ తాగేసి, మౌనంగా గ్లాసామె చేతికందించాడతను.

''అదోలా ఉన్నారేం? జనం చాలా ఎక్కువగా వచ్చారా? ఆలస్యమైపోయింది'' అందామె భర్త ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

''అమ్మవారి జాతర గదా, ఈ పదిరోజులూ జనం ఎక్కువగానే వస్తారు. రద్దీవల్ల కాస్త అలసటగా ఉంది. అంతే, మరేంలేదు!'' అన్నాడతను ఆవులిస్తూ. ఆమె మాట్లాడలేదు.

''నువింకా భోంచెయ్యనట్టుంది. భోంచేసేసి పడుకో కాత్యాయనీ! నేనూ పడుకుని మళ్లీ తెల్లవారు ఝామున నాలుగింటికి లేస్తాను.'' మనసులో దేవిని ధ్యానించుకుని, నమస్కరించుకుని నడుంవాల్చాడు వంశీ.

నిట్టూర్చి లోనికెళ్లిపోయింది కాత్యాయిని. ఆమె కాపరానికొచ్చి ఏడాది దాటింది. ఆమె తండ్రి ఓ బడి పంతులు. ఆయన రిటైరయ్యే లోపల ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లు అష్టకష్టాలు పడి చేసాడు. ఆఖరిదైన కాత్యాయిని పెళ్లి చెయ్యడం ఆ తరువాత అతనికి తలకు మించిన పనే అయింది. మధ్యవర్తుల ద్వారా ఆయన వంశీకృష్ణను గురించి విన్నాడు. ఆ సంగతి కూతురికి చెప్పినప్పుడామె ''ఛీ! ఓ పూజారిని పెళ్లి చేసుకోవాల్సిన ఖర్మ నాకేంపట్టింది ...?

అమ్మకము! అమ్మకము! అమ్మకము!





రు. 180/—లకు టు—ఇన్—వన్—మోడల్ ట్రాన్సిస్టర్‌తో ఒ.పి.ఇ. రిస్టువాచ్ ఉచితము. డబ్బు తిరిగి యిచ్చే పూచీపై 60 రోజుల వుచిత ట్రయల్. నేషనల్ టు—ఇన్—వన్ మోడల్ ఆల్‌వరల్డ్ ట్రాన్సిస్టర్ 1984 మోడల్. జపాన్ సాంకేతిక సృష్టి. ఇప్పుడు అమ్మకమునకు రు. 180/-కి ఒక రిస్టువాచ్‌తో ఉచిత బహుమతి లభించుచున్నది. రెండు సంవత్సరములు గ్యారంటీ. మీ అడ్రసుకు వి.పి.పి. ద్వారా పంపబడును. నేడే ఆర్డర్లు త్వరపడండి.

మీ అడ్రసు ఇంగ్లీషులో గాని హిందీలోగాని వ్రాయండి.

Geneva Electronics, (W.A.S.)

136, New layal pur, DELHI - 110 051.

Phone : 212453



ఘుమ ఘుమలాడే కమ్మని
వంటలకు చక్కటి
రుచి కొరకు వంట నూనె

స్వచ్ఛమైన పరిశుద్ధమైన జ్యోతి డబల్ రిఫైండ్ వేరుశనగనూనె. మీ వంటఇంటిని విడిచివెళ్ళని శాశ్వత అతిథి మంచి వంటలు అనంతకాలం మకాం చేస్తుంది
జ్యోతి 15.5 కిజీలలోనే కాక, మీరు కోరుకున్న సైజులలో 4 కిజీలు, 2 కిజీ లలో కూడా లభిస్తుంది.

JYOTI
DOUBLE REFINED
GROUNDNUT OIL

తయారు చేయువారు ఆంధ్ర ఆయిల్ రిఫైనరీ. ప్రొ. కాంతిబ్రదర్స్. కర్నూలు-518 001.

కొత్త వెలుగు

అక్కయ్యలకిద్దరికీ మంచి మంచి సంబంధాలు చూసిచేశావు... నేనంటే నీకు నిర్లక్ష్యం నాన్నా, అందుకే నాకీ సంబంధం అంటగట్టాలని చూస్తున్నావు'' అని కోపగించుకుంది తండ్రి మీద.

''అబ్బాయి ఉత్తముడు అన్నారమ్మా ... అలాటి వాడు కట్నం పొయ్యకుండా దొరకడం సులభంకాదు. నా పరిస్థితి కూడా ఆలోచించు తల్లీ ! '' అన్నాడాయన నీరసంగా.

''ఓ పూజారిని మనిళ్ళల్లో ఏ ఆడపిల్లా చేసుకున్న దాఖలా లేదు ! పెళ్ళాయ్యాక వాళ్ల జీవన విధానానికి మనం అలవాటు పడగలమో లేదో కూడా తెలీదు. కాబట్టి నాకిష్టంలేదు !'' అని మొదట్లో ఖచ్చితంగా చెప్పేసింది. పూజారంటే రూపురేఖలు బాగోని ఓ అనాకారని ఊహించుకుందామె. అదామె తప్పుకాదు. పదో తరగిత్తి ఫెయిలయిన ఆమెకు క్లాసు పుస్తకాలందించిన లోకజ్ఞానం అంతంత మాత్రమే ! ఆ పైన చేతికి దొరికిన నవలలన్నిటినీ చదివి భవిష్యత్తును గురించి ఆమె ఖరీదైన కలలే కంది ! అయితే తండ్రి బాధ చూళ్లేక అయిష్టంగానే పెళ్లిచూపులకు మాత్రం ఒప్పుకుంది. వంశీకృష్ణను చూశాక మాత్రం నివ్వెరపోయింది. అతను ఆమె ఊహించినట్లు అనాకారి కాకపోగా, 'మనుచరిత్ర'లోని ప్రవరాఖ్యుని మూర్తిలా పోలి ఉన్నాడనిపించింది. ఆ రాత్రి అతని ఎత్తైన పసిమిరంగు రూపం, విశాల వక్షం, అందం, గాంభీర్యం పోటీపడే వదనం... ఆమెను నిద్ర పోనియ్యలేదు. గుండెల్లో తియ్యటి బాధ ! ఊహల్లోని నాయకుణ్ణి పొందబోతున్నానన్న ఆనందం...! ఆ మన్మధునితో తన భవిష్యత్తును గూర్చిన రంగుల కలలు...! ఉదయానికల్లా కాత్యాయిని వివాహానికి అంగీకరించింది.

పెళ్లయ్యాక రెండు మూడు నెల్లవరకూ వైవాహిక జీవితం సంతృప్తికరంగానే గడించిందామెకు. కానీ రాను రానూ ఏదో వెలితి కనిపించసాగిందామెకు. 'ఎంత పూజారయితే మాత్రం ! పట్టుమని పాతికేళ్లయినా నిండని ఇతనికేమిటింత భక్తి ?' అని లోలోపల విసుక్కునేది. వంశీకృష్ణ ఉదయం నాలుగింటికే నిద్రలేచి స్నాన సంధ్యలు ముగించుకుని ఆలయానికి వెళ్లిపోతాడు. మళ్లా మధ్యాహ్నం పన్నెండింటికొచ్చి భోంచేసి, కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ సాయంకాలం సంధ్యవార్చి కోవెలకెళ్లి, రాత్రి ఎనిమిదింటికో, పండగ రోజుల్లో అయితే ఏ పదింటికో అలసిపోయి తిరిగొస్తాడు. యాంత్రికమైన అతని ఈ దినచర్య ఆమెలో చికాకుని పెంచింది. సమయం దొరికినప్పుడల్లా అతను వేద గ్రంథాలు చదివి వాటిలోని ధర్మసూక్ష్మాల్ని భార్యకు విడమర్చి చెప్పేవాడు. ఆమెనా ఆధ్యాత్మిక గ్రంథాలు

డా. కె.యల్. నారాయణ

వైద్యవిద్వాన్, వైద్యాచార్య
చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.

లక్ష్మీ కుమారి క్లినిక్,
మెయిన్ రోడ్, తెనాలి.

సినీతారలు
మీకు నచ్చే నలుగురి తారల సెక్సు ఫొటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి,నటుడి ఫొటో సెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులగల డైరీ 2రూ.
కావలసినవారు M.O.చేయుండి.
వై.కె.మూర్తి
వాసవి.వారివీధి విజయవాడ.2.

డా॥ వి. వి. కె. రావ్, B.A.
వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్
వివాహము వాయిదా వేయనవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్
టి బి. రోడ్, తెనాలి
ఫోన్ : 3700 & 4010.

ఆటోమాటిక్ రిస్ట్‌వాచ్
కేవలం రు. **25/-** మాత్రమే
21 జువల్స్ హెచ్.ఎం.టి. ఆటోమాటిక్ రిస్ట్ వాచ్ చైన్‌పద్ధతితో, 7 సంవత్సరముల గ్యారంటీతో కేవలం రు. 25/- మాత్రమే లభిస్తుంది. కావలసినవారు పోస్టేజి, మరియు ప్యాకింగ్ ఖర్చుల నిమిత్తం అదనంగా రు. 10-95 ను క్రింది అడ్రసుకు పంపవలెను.
BASANT TRADING Co., (A)
PO LALBIGHA, (NAWADAH).

కొత్త వెలుగు

ఏ మాత్రం ఆకర్షించలేకపోయేవి! వాటిల్లో నవలల్లోలాగా అందమైన కలలూ, కల్పనలూ ఉండవు కాబట్టి, సహజంగానే ఆమె వాటిని పట్టించుకునేదికాదు. భర్త ఆలయానికెళ్ళిపోయాక తనమానాన తాను తనకిష్టమైన పుస్తకాల్ని చదువుతూ గడిపేది. 'తన భర్త కూడా నవలల్లోని నాయకుడిలాగే గొప్ప అందగాడు. కానీ ఏం లాభం? అతనికి భార్య అందాన్ని పొగట్టం చేతకాదు. తనను అపరిమితమైన సుఖాల్లో, భోగాల్లో తేలియాడించటం అసలే చేతకానివాడు... ప్చ్! స్నేహితురాళ్ళు వాళ్ళ దాంపత్య సుఖాన్ని గుసగుసలుగా తనకు చెప్పినప్పుడు... చచ్చేటంత సిగ్గు!... ఛ. ఛ వాళ్ళంతగా వాళ్ళ వాళ్ళ భర్తల్ని గురించి గొప్పలు చెప్పుకుంటారో!' అని నిట్టూర్చేది కాత్యాయిని. ''ఇవన్నీ నీకు తెలీదు లేవే! మీ ఆయనో వెర్రిబాగుల పూజారి... అంతేగా'' అని ఆమె ఎదటే ఆమె స్నేహితురాళ్ళ హేళన చేసేవాళ్ళు. ఆ రకంగా భర్త దాంపత్య సుఖాన్ని విస్మరించుకున్నా, ఆమెలో వైవాహిక జీవితం పట్ల అసంతృప్తి పెరిగిపోయింది...

భోజనం ముగించుకుని పాత్రలు కడిగేసాక, వంటిల్లు సర్దుకుని ఆరుబయట నిద్రిస్తున్న భర్త పక్కకు చేరింది కాత్యాయిని. తలకిందుగా ఓ చెయ్యి ఉంచుకుని ప్రక్కకు ఒత్తిగిలిపడుకున్న భర్తవేపు ఓ క్షణం రెప్ప వాల్చకుండా చూసింది. 'అసలు అందంలో ఈయన ముందు రాజారావు ఎందుకు పనికొస్తాడు...?' అనుకుంది.

రాజారావు! నెల క్రితం సుడిగాలిలా తన జీవితంలోకి ప్రవేశించిన వ్యక్తి! ఇప్పుడు తన తనువులో, మనసులో చెప్పలేని అలజడిని సృష్టిస్తున్న వ్యక్తి! రాజారావు వాళ్ళూరివాడే. ఆమె పెళ్లికి ముందు ముఖ పరిచయం మాత్రముండేది. తండ్రి దగ్గరికి ఏవేవో వ్యాపార సంబంధమైన సలహాలకోసం వచ్చేవాడు. ఆమె పెళ్లైపోయాక, వ్యాపారం పనిమీద ఆ ఊరొచ్చినపుడల్లా ఆమెను చూసిపోడానికొచ్చేవాడు. ఎన్నెన్నో పుస్తకాలు తెచ్చిచ్చేవాడు. అవి ఆమెకెంతో ప్రీతిపాత్రమైన నవలలు. ఇద్దరూ వాటి గురించి గంటలతరబడి చర్చించుకునేవాళ్ళు. వారి పరిచయం క్రమంగా పెరిగింది. ''అసలు నువెంత అందంగా వుంటావో నీకు తెలుసా కాత్యాయినీ? తెలీదు. ఎందుకంటే ఈ సంగతి పాపం నీకెవరూ చెప్పరుగా! నిజంగా నిన్ను చూస్తుంటే నా మతి పోతోంది. నీకు పెళ్లి చేస్తున్నట్టు ముందుగా మాస్టారు నాకొక్కమాట చెప్పి ఉంటే నిన్ను ఆ పళంగా లేవదీసుకు పోయేవాణ్ణి. ఎందుకంటే మీది చాలా సాంప్రదాయమైన కుటుంబం. మన పెళ్లికి మాస్టారు ఒప్పుకోరని నాకు తెలుసు!'' అని నిట్టూర్చేవాడు రాజారావు. అతనలా నిట్టూర్చినపుడల్లా ఆమెకోవైపు భయమూ, మరోవైపు ఆనందమూ కలిగేవి. ఒళ్ళు పులకరించేది! ఎందుకంటే భర్త ఎన్నడూ ఆమెతో ఇలాటి 'థ్రిల్లింగ్' విషయాలు మాట్లాళ్లేదు మరి! ఓ ఉదయం భర్త కోవెల కెళ్లిపోయాక కుండపోతగా వాన కురుస్తోంది. రాజారావిచ్చిన ఓ పుస్తకం తెరిచింది కాత్యాయిని. నాలుగు పేజీలు చదవగానే అదొక చవకబారు 'సెక్సు' పుస్తకం అని తెలిసిపోయింది. కానీ... ఏకాంతం రెచ్చగొడుతుంటే, కుతూహలాన్ని చంపుకోలేక దాంట్లో లీనమైపోయి చదవసాగింది. రాజారావు వానలో ముద్దయిపోయి లోనికి రావడంగానీ..., అతను తలుపులు గడియ పెట్టడంగానీ ఆమె గమనించలేదు. ఆతనామె దగ్గరగా వెళ్లి నుంచున్నాడు. ఆమె అప్రయత్నంగానే లేచి నుంచుంది. ఒక్క ఉదుటున ఆమెను సుడిగాలలా చుట్టేసి హత్తుకు పోయాడతను. ఆ క్షణం ఆమెకు భర్తగానీ అతను బోధించిన ధార్మిక విషయాలుగానీ... ఏవీ గుర్తుకురాలేదు. కామం పురివిప్పి పెనవేసుకున్న కౌగిట్లో విచక్షణ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యింది! శరీరాలు ఎదురు తిరిగి ఆలోచన గొంతు నులిమేశాయి! ఆ క్షణాల్లో సిగ్గు బిక్కచచ్చిపోయింది. ఆ తరవాత చాలాసార్లు వాళ్లిద్దరూ ఆ అనుభూతిని చాటుమాటుగా చవిచూడ్డంలో గొప్ప 'థ్రిల్'ను ఫీలయ్యేవారు. కానీ కాత్యాయినిలో క్రమంగా ఉదాసీనత చోటు చేసుకుంది. 'భర్తకీ విషయం తెలిస్తే?' అన్న భయం ఆమెను పట్టి పీడించసాగింది. ఆమెలో వివాహబంధానికీ, వాంఛకీ మధ్యన ఘర్షణ నానాటికీ పెరిగిపోసాగింది.

''ఇలా అటూ ఇటూ గాక ఊగిసలాడే మనసుతో ఎన్నాళ్ళు బాధపడుతూ ఉంటావిక్కడ? నాతో వచ్చెయ్యి... నీ జీవితాన్ని నిస్సారం చేసుకోకు!. మనం మళ్లీ పెళ్లి చేసుకుని హాయిగా ఉందాం...! ఏం, మాట్లాడవు?', రాజారావు బలమైన కౌగిట్లో బంధించి గుసగుసల మధ్యన అడిగాడామె నారోజు...

నిద్దట్లో మెలకువ వచ్చి కళ్ళు తెరిచి చూసాడు వంశీకృష్ణ. ప్రక్కనే కూచుని ఆలోచిస్తున్న భార్య అగుపడింది.

''కాత్యాయినీ! నువింకా పడుకోలేదా? ఇలా తెల్లవార్లూ మేలుకుంటే ఆరోగ్యం చెడిపోదూ? ఇలా రా...!'' భార్యను దగ్గరికి తీసుకుని ఆమె కళ్లల్లోకి చూశాడతను. ''ఏమిటి విషయం...?'' చిరునవ్వుతో ప్రశ్నించాడు.

''అబ్బే...! మరేం లేదండీ. ఏదో పీడకల వచ్చి మెలకువ వచ్చింది! మీరు పడుకోండి. మళ్లీ పొద్దున్నే లేవాలి గదా!'' అంది నెమ్మదిగా అతన్ని విడిపించుకుని. కానీ జరుగుతున్నది పీడకలలాటి వాస్తవమే అని ఆమెకు తెలుసు. చాటుగా తప్పు చేస్తూ భర్త ముఖంలోకి సూటిగా చూడాలంటేనే భయంగా ఉందామెకు.

తెల్లవార్లూ నిద్రపట్టక ఆకాశంలోకి చూస్తూ పడుకుందామె, అంతకంతకూ దూరంగా పరుగెడుతున్నట్టు అగుపిస్తున్న చందమామని చూస్తూ!

*   *   *

శిశిరఋతువు ప్రవేశించింది! మారిపోయిన ఋతువులు కొందరి జీవితవిధానాన్ని కూడా మార్చేసాయి! పల్లకీ బోయీలు ప్రసాదంతో పాటుగా కొంత కూలీని ముట్టజెపుతేగానీ పనిలోకి రామన్నారు క్రమంగా అమ్మవారి ఊరేగింపు మూలనపడింది. వాళ్లు తమ ఆడాళ్లకి జీతభత్యాలు నిర్ణయిస్తేగానీ పనిలోకి పంపమని మొండికేసారు. అమ్మవారి పూజా పునస్కారాలకే ఆంతరాయం ఏర్పడ్డంలో సమస్య గ్రామ పెద్ద వరకూ వెళ్లింది. ఊరు ఊరంతా ఓ రోజు పంచాయితీ పెట్టి, పనివాళ్ల స్వార్థబుద్ధిని తిట్టిపోసారు. దేవికి ఆగ్రహం వస్తే ఆ నీచుల కుటుంబాలన్నీ నామరూపాల్లేకుండా తుడిచి పెట్టుకు పోతాయని పెద్దపూజారి రామానుజం శాపనార్థాలు పెట్టాడు. 'ఆలయాన్ని ఎవరు శుభ్రం చెయ్యాలి?' అనే ప్రశ్నకు పరిష్కారం దొరక్క పంచాయితీ ప్రెసిడెంటుకు దిక్కు తోచకుండా ఉంది. "జీతమిచ్చి మనుషుల్ని పెట్టాలంటే దానికి కొన్నాళ్లు పోవాలి, గవర్నమెంటు గ్రాంట్లొచ్చేదాకా... మరెలా?" అని ఆయనగారు మధనపడుతుంటే వంశీకృష్ణ ఓ పరిష్కారాన్ని సూచించాడు. అది విని ఊరు ఊరంతా బిత్తరబోయారు. "కుర్రవెధవ! అతితెలివి వీడునూ" అని గొణుక్కున్నారు కొందరు.

"మనూళ్లో సుమారు ఇరవై ముప్పై ఫ కుటుంబాలకంటే ఎక్కువలేవు. రోజువారీ వంతులు వేసుకుని ప్రతి కుటుంబంలోంచీ ఓ వ్యక్తి వచ్చి దేవి ఆలయాన్ని శుభ్రం చేసేట్టు అయితే ఏ గొడవా రాదు. ఇక పండగలప్పుడు మనమే పల్లకీమోసి దేవిని ఊరేగించుకుందాం. దీనికోసం ప్రత్యేకంగా బోయీలెందుకూ?" అన్నాడు అంతే.

"అబ్బే...! అదెలా కుదురుతుందీ?" అన్నాడాయన నీళ్లు నములుతూ; ప్రెసిడెంటు గారికి భయం పట్టుకుంది తనెక్కడ పల్లకీ మోయాల్సి వస్తుందోనని!

"ఎందుక్కుదరదండీ? మన పని మనమే చేసుకుంటాం! దేవి పట్ల ఇంతకంటే మన భక్తిని వెల్లడించుకునే మార్గం వేరే ఏముంది?" అన్నాడు వంశీ.

"నీ ఉద్దేశం ఏమిటబ్బాయ్! ప్రెసిడెంటు గారింటినుంచి కూడా మనుషులొచ్చి కోవెల ఊడిచి వెళ్లాలనా?" రామానుజం వంశీవేపు తిరిగి కోపంగా ప్రశ్నించాడు.

"తప్పేముందండీ! దైవం ముందు అందరూ సమానమేగా! గొప్పా — పేదా తారతమ్య మెక్కడుందసలు? అలా ఉండాలని మీరే వేదగ్రంథంలోనైనా చదివారా పూజారి గారూ?" చిరునవ్వుతో ప్రశ్నించాడు వంశీ.

ఒళ్లుమండిన రామానుజం సమాధాన మివ్వ బోయేంతలో, గుంపులోంచి నెమ్మదిగా ముందు కొచ్చి నుంచుంది యాది. వంశీకృష్ణకు నమస్కరించి, "బాబూ, మీ రొప్పుకుంటే అమ్మోరిగుడి రోజూ నాను సుబ్బరం సేసి పెడతాను. మీరు నాకేవీ ముట్టజెప్పక్కరనేదు." అంది వినయంగా. రామానుజం యాదికేసి యీసడింపుగా చూసాడు.

"ఛీ ఛీ! నువ్వు కోవెల శుభ్రం చేస్తావా? నీలాటి తక్కువ కులంది గుడి తుడిస్తే భక్తుల మాట దేవుడెరుగు, ముందాకోవెల్లోని అమ్మవారు అక్కడ ఉండకుండా వెళ్లిపోతుంది" అన్నాడు.

ఘొల్లుమన్నారు జనం.

యాది కళ్లలో నీరు తిరిగింది. బిక్కు బిక్కు మంటూ వంశీకృష్ణ కేసి చూసి తలొంచుకుని నుంచుంది. ప్రెసిడెంటూ మరికొందరూ మాత్రం 'హమ్మయ్య!' అనుకున్నారు పని తప్పిందన్న ఉద్దేశంతో. ఇంకొందరు ఆ తక్కువ కులంది అసలు కోవెల్లోకి అడుగుపెట్టడమే నిషిద్ధమన్నారు. వాదోపవాదాలు జరిగేయి. చిట్టచివరికి వాళ్ల అవసరం యాదిని పనికి కుదిరేటందుకు అంగీకరింప జేసింది. అవసరాన్ని గడుపుకుందుకు ఊరిప్రజలు తీసుకున్న నిర్ణయాన్నిచూసి వంశీ నవ్వుకున్నాడు. అతనీ విషయాన్ని ముందుగానే ఊహించాడు. అందుకే ఎవరితోనూ వాదించక మౌనంగా ఉండిపోయాడు.

ఓ ఉదయం కోవెల ముంగిలి అలికి ముగ్గులు తీరుస్తున్న యాదిని అడిగాడు వంశీ:

"యాదీ, రోజూ క్రమం తప్పకుండా అమ్మవారికి సేవచేసి పోతుంటావు గదా! నీకేం కావాలని అమ్మవారిని కోరుకుంటావు?"

"నాకేటి కావాల పూజారయ్యా? ఆయమ్మ నా మావనూ, సంటోడ్నీ సల్లంగ చూస్తే సాలు ... అసలాయమ్మను చూస్తేసాలు నా మనసు నిండినట్టు ఉంటాది!"

"మీ ఆయనేం చేస్తుంటాడు? టౌనులో పనికెళతాడా?"

"ఒకప్పుడెల్లేవోడు బాబా! మా సంటోడు పుట్టిన నెలక్కావోసు, తాపీపని సేసేటప్పుడదేదో భవంతి మీదనుంచి పడిపోనాడు. నడుంకి దెబ్బలు తగిలి పచ్చవాతమొచ్చీసి కాళ్లు సచ్చుబడిపోయి నయ్! ఆయాల నుంచీ మరీ మంచం మీదనుంచి దిగనేదు. మా గూడెంలోనా మాకు ముందూ యెనకా యెవురూ నేరయ్యా! అందుకని ఇక్కడే ఉండిపోనాము. నాను దొరగారింట్లో పనికి కుదిరి నాను. నాను పంజేసి తెచ్చి దానితోనే మా సంసారం గడుసుద్దయ్యా! అంతా ఆ అమ్మోరి దయ." కాళ్లూ, చేతులూ కడుక్కుని భక్తిగా దేవికి దండం పెట్టుకుని "ఎల్లొస్తాను పూజారయ్యా. మల్లా సాయంకాలవొస్తాను!" అనేసి చకచకా మెట్లుదిగి వెళ్లిపోతున్న యాది కేసి అలా చాలాసేపు చూస్తూ నుంచుండిపోయాడు వంశీ.

మధ్యాహ్నం ఇంటికెళ్లిన అతనికి కాత్యాయిని కనిపించలేదు. పక్కింటికి గానీ వెళ్లిందేమో ననుకుని భోంచేసి పడుకున్నాడతను. సాయంకాలం అయిదు అవుతున్నా భార్య జాడలేదు. పక్కింట్లో వాకబు చేస్తే ఉదయం రాజారావు రావడం చూసామనీ, ఆ తరవాత వాళ్లిద్దరూ ఎక్కడి కైనా వెళ్లారేమో తమకు తెలీదనీ సమాధానం వచ్చింది. చికాగ్గా ఇల్లంతా కలయదిరిగాడతను. కాత్యాయిని పెట్టెదగ్గిర మాసిన బట్టలు కొన్ని



ఆంధ్రపత్రిక

THE ANDHRA PATRIKA

(Simultaneously published from VIJAYAWADA & HYDERABAD

DISPLAY RATES

(Effective from 1 - 12 - 1983)

Display: (Minimum 5 cms. Single Column)

Casual · upto 249 Col Cms.

Contract : 250 Col. Cms. and above within a year.

	Casual Per Col. Cm,	Contract Per Col. Cm.
Combined Edition	Rs. 18/-	Rs. 16/-
Vijayawada Edition	Rs. 15/-	Rs. 12/-
Hyderabad Edition	Rs. 10/-	Rs 8/-
Ear Panel : (Size: 4.5 cms. x 7.5 cms.)	Rs.175/-	Rs. 150/- (Contract 26 panels)

Legal. Public Notices, Municipal and other local bodies, Tender Notices, Company Prospectus, Announcements, Election Notices etc } 18/- per Col. Cm.

Classified Advertisements : (minimum 4 lines)

Wanted, Sale, Business, Financial, Missing, Auction, Acknowledgments, Matrimonial etc.

	Combined Edn. :	Vijayawada Edn ;	Hyderabad Edn.
per Line	Rs. 8/-	Rs. 6/-	Rs. 4/-

Box No. Service and Redirection Charges Rs. 5/-

Special Positions :

Front Page : (Minimum 30 cms.)	100% Extra
Front Page solus : (Minimum 25 cms. x 3 col.)	150% Extra
Specified Page :	25% Extra
Top of Advertisement Column	25% Extra
Advertisements other than in Telugu	50% Extra
Black plus One Colour Extra	50% Extra
Minimum size for Colour Advt.	25 cms. x 4 cols.

Block making charges, if any, will be extra.

TECHNICAL DATA

Column Height	52 Cms.
Column width	4.8 Cms. or 11½ Cms.
Colnms to a Page 8	Screen for half tone 65

Mats and Stereos accepted.

చిందర వందరగా పడున్నాయి. పెట్టె తెరిచి చూసాడు. ఖాళీగా ఉంది. 'తనతో చెప్పకుండా ఎక్కడికి వెళ్ళినట్టు ?' అనుకుంటూ ఖంగారుగా పూజ గదిలోకి వెళ్ళాడు. దేవి విగ్రహం ముందు దీపం వెలిగించిన జాడలేదు ! అక్కడొక కాయితం రెపరెప లాడుతూంది. వణుకుతున్న చేతుల్తో దాని తీసుకుని చదివాడు. రెండే రెండు వాక్యాలున్నాయి –

"మీతో జీవిత విధానం నాకు సరిపోలేదు. నచ్చిన జీవితాన్ని వెతుక్కుని, నచ్చిన వ్యక్తితో వెళ్ళిపోతున్నాను –కాత్యాయిని."

'వాళ్ళిద్దర్నీ స్నేహితులుగా భావించి ఏమాత్రం అనుమానించకుండా ఊరుకున్నందుకు తనకు దక్కిన ప్రతిఫలం ఇదా ?'

"కాత్యాయనీ ! నన్నెందుకు వదిలి వెళ్ళిపోయావు ? నేన్నీకేం ద్రోహం చేసాను ?" దేవి విగ్రహంముందు కుప్ప కూలిపోయి పసి పిల్లాడిలా వెక్కివెక్కి రోదించాడు అతను.

* * *

భార్య వెళ్ళిపోయాక వంశీ మళ్ళీ మామూలు మనిషిగా మారడానికి చాలా రోజులు పట్టింది. క్రమంగా అతనిలో ఒక విధమైన నిర్లిప్తత చోటు చేసుకుంది. వేళకింత ఉడకేసుకుని తినడం, వీలయినంత ఎక్కువకాలం భగవత్సాన్నిధ్యంలో గడపడం అలవాటయిపోయింది. 'ఆధ్యాత్మిక చింతనా, ఆలయంలో అర్చన బాధ్యతా తనకు లేకుండా ఉండి ఉంటే తనేనాడో పిచ్చివాడై రోడ్డున పడేవాడు !' అనుకునేవాడు. సంగతి ఎరిగున్నవాళ్ళు అతన్ని ఓదార్చబోయారు. వాళ్ళను వారించి దయుంచి తనని ఒంటరిగా వదిలిపెట్టమని ప్రాధేయపడేవాడు. చాలామంది 'ఇతనికి పిచ్చిగానీ పట్టలేదుకదా !' అని ఆశ్చర్యపోయారు.

ఓ రోజుదయం ఆలయానికి బయలుదేరాడతను. అప్పుడు తెల్లవారుఝాము నాలుగ్గంటలు దాటింది. ఆ ప్రశాంతమైన నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ కోవెల గంట రెండు మూడుసార్లు మ్రోగి ఎవరో చేత్తో పట్టుకుని ఆపేసినట్టు ఠక్కున ఆగిపోయింది. ఉలిక్కిపడ్డాడతను. అది మామూలుగా కోవెల తెరిచే సమయమే. ఒక్కోసారి తనకంటే ముందే రామానుజం దేవిని మేలుకొలపడానికి వెళుతూఉంటాడు. కానీ, ఆ గంటలు కొట్టిన తీరు ఎందుకో ఖంగారుగా, అపసవ్యంగా ధ్వనించింది అతనికి. 'ఏదో జరగబోతూంది !' అని అతని మనసతన్ని హెచ్చరించినట్టనిపించింది. పరుగులాటి నడకతో మెట్లెక్కి కోవెల చేరుకున్నాడు. ఆవరణలో ఎవరూలేరు. కోవెల వెనుక వైపునుంచి మాత్రం ఏవో గొంతులు వినిపించాయతనికి. చప్పుడుకాకుండా ఆ వైపుగా

వెళ్లి అక్కడి దృశ్యాన్ని చూసి స్థాణువులా నుంచుండిపోయాడు.

"ఒద్దు బాబూ ! మీకు దండం పెడతానండయ్యా. నానలాంటిదాన్ని కాను. నన్నొదిలిపెట్టండయ్యా." నేలమీంచి లేవడానికి ప్రయత్నిస్తూ గిలగిల్లాడుతూంది యాధి.

"ష్...! అరవకే. ఈ సంగతి మూడో కంటికి తెలీనివ్వను. బెట్టుచెయ్యకు ! పక్షవాతం మొగుడితో నీకేం సుఖం చెప్పు ?" ఆమెతో పెనుగులాడుతూ ఆమె నాక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు రామానుజం.

"థూ...! ఏం పూజారయ్యవయ్యా నువ్వు? రోగమొచ్చి మంచాన ఉన్నా నా మావే నాకు దేవుడు ! నానుంకోడ్ని ఒల్లను... స్సీ...! నన్నొగ్గు. నేకుంటే కేకలెట్టి నీ పరువుతీత్తాను" దుఃఖంతో, కోపంతో ఒణికిపోతూంది యాది.

"నోరు ముయ్యవే ! పతివ్రత కబుర్లా నువ్వూనూ. ఈ వేళప్పుడు నిన్నెవడాదుకుంటాడు..." మాట పూర్తి చెయ్యకుండానే యాది చీరెను పశువులా లాగేస్తూ ఆమె మీదకు లంఘించాడు రామానుజం. గుండె లివిసిపోయేట్టు అరిచింది యాది. అంతలో, మెడమీద పడ్డ దెబ్బతో విద్యుద్ఘాతం తిన్నవాడిలా ఎగిరి అవతల పడ్డాడు రామానుజం. అతని తలను చేత చిక్కించుకొని పిచ్చివాడిలా నేలకేసి బాదసాగేడు వంశీ. చావుకేకలు పెట్టాడు రామానుజం. "పశువుకంటే హీనుడివి...థూ ! నువ్వెట్టా పూజారివి ? ఇప్పుడు యాది కులం అడ్డు రాలేదా నీకు ? ఈ రోజు నా చేతుల్లో నీకు చావు మూడింది!" ఆవేశంతో ఒణికిపోతూ చేతుల్తోనూ,. కాళ్లతోనూ రామానుజాన్ని కుళ్లపొడిచాడు వంశీ. చివరికెలాగో తప్పించుకుని హీనమైన ఒంటితో, పీలికలైన పంచెతో ఇంటికి పరుగుతీశాడా పూజారి. కన్నీళ్ళు తుడుచుకుని, దండం పెడుతూ కృతజ్ఞతలు చెప్పుకోబోయిన యాదిని వారించి "ముందాలయం శుభ్రం చెయ్యి యాదీ, దేవీ పూజకు వేళ మించిపోతోంది" అన్నాడు శాంత స్వరంతో. అంతలోనే శాంతంగా మారిపోయిన అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ, చీపురు తీసుకుని బయలు దేరింది యాది.

* * *

ఆ సాయంకాలం ఆలయ ఆవరణలో జనం చాలామంది గుమిగూడి ఉన్నారు. "ఛ! ఆ చచ్చేదేదో గుళ్లోనే చావాలా ! అప్పుడే సాయంత్రమైపోయింది. ఇప్పుడెలా శవాన్నిక్కడ్నించి కదల్చటం ?"

"ఇప్పుడీ కులంగాని కులందాని శవాన్ని ఎవరు తీసుకెళ్లేది ? రామచంద్రా ! ఎలాటి చిక్కొచ్చిపడింది" అందరూ తలోరకంగా వ్యాఖ్యానాలు చేస్తూ నుంచున్నారు. అప్పుడే వచ్చిన వంశీకృష్ణ జనాన్ని తప్పించుకుని అక్కడి దృశ్యాన్ని చూసి హతాశయుడైపోయాడు. పురాతనమైన ఆ కోవెల ప్రాకారంలోని ఓ రాతి స్థంభం క్రింద యాది నిర్జీవంగా రక్తపుమడుగులో పడి ఉంది.

"ఎలా... ఎలా జరిగిందీ ఘోరం ?" పిచ్చిగా చుట్టూ చూస్తూ కంపిత స్వరంతో అడిగాడు వంశీ.

"ఏముందీ ! కోవెల పాతకాలంది. పైగా కూలడానికి సిద్ధంగా ఉందాయె ! ఈ ముదనష్టపుది సరిగ్గా స్తంభం కూలే సమయానికి అక్కడే ఊడుస్తూ చచ్చిందట. పోతే పోయిందిలే ! మన గుడికి గ్రాంటు సాంక్షనయ్యింది. ఇక మీదట జీతమిచ్చి మనుషుల్ని పెట్టుకోవచ్చు. కానీ ఆలయం మైలపడిపోయింది !" ప్రెసిడెంటు తాపీగా జవాబిచ్చాడు. వంశీ ఏమీ మాట్లాడలేదు. చుట్టూ కలయజూసి "కాస్త ఎవరైనా వచ్చి ఈ స్తంభాన్ని ప్రక్కకి జరపడానికి సాయం చెయ్యండి" అన్నాడు బిగ్గరగా. "మునిసిపాలిటీ వాళ్లను టౌన్నుంచి రమ్మని కబురెడదాం. ఎవరూ ముట్టుకోకండి!" అరిచారెవరో. "మీకే చెపుతూంట ! స్తంభాన్ని తాకినంత మాత్రాన మీరెవరూ మైలపడిపోరు" గట్టిగా అరిచాడు వంశీ. మౌనంగా ఓ ఇరవైమందొచ్చి అతనికి సాయం చేసారు. అతనామె శవాన్ని చేతుల్లోకి ఎత్తుకోబోతుండగా, "ఆగు వంశీ ! ముట్టుకోకు" అని అరిచాడు రామానుజం బిగ్గరగా. జవాబుగా ఒక్కమారతనివేపు ఏయాసడింపుగా చూసి కాండ్రించి నేలమీద ఉమ్మేసాడు వంశీ. తరవాత మౌనంగా యాది శవాన్నెత్తుకుని కోనేటివేపు కదిలాడు. జనం అతన్నో వెర్రివాణ్ణి చూసినట్టు చూడసాగేరు. అతను నెమ్మదిగా కోనేట్లోకి దిగి యాది శవాన్ని శుభ్రపరిచాడు. అమ్మవారి పట్టువస్త్రాన్ని తెచ్చి యాది శవానికి చుట్టబెట్టాడు. దేవి సన్నిధినుండి పసుపు కుంకాలు తెచ్చి యాది ముఖాన అలంకరించాడు. కోవెల్లో పూసిన గన్నేరు పూలు కోసి ఆమె శవంమీద చల్లాడు.

"చూస్తారేంరా ! మన కోవెలనూ, అమ్మవారినీ కూడా అపవిత్రపరిచాడు. వెధవను నాలుగు తన్ని ఊళ్లోంచి వెలివెయ్యండి." అసహనంగా అరిచాడు ఊరి ప్రెసిడెంటు. జనం ఆవేశంగా వంశీమీదపడి అందినచోటల్లా గుద్దేరు. కొందరు తుపుక్కున ఉమ్మేసారు. అతను మౌనంగా దెబ్బలన్నింటినీ భరించాడు. కాసేపు గడిచాక నెమ్మదిగా తలెత్తిచూసాడు. చుట్టూ చీకట్లు అలుముకుంటున్నాయి. ఇంతలో యాది కొడుకు అయిదేళ్లవాడొచ్చి చెప్పాడు, "అమ్మ ఇంకా ఇంటికి రాలేదని అయ్య నన్ను పంపిండు!" వాడు బిక్కమొహం వేసుకుని వంశీని, వాళ్లమ్మ శవాన్నీ చూడసాగేడు పరిస్థితి అర్థంకాక. వంశీ నెమ్మదిగా లేచినుంచున్నాడు. మొహంమీది రక్తపు చారికల్ని తుడుచుకుని, ఆ పసివాణ్ణి దగ్గిరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

"అమ్మ ఇకమీదట రాదు బాబూ ! ఇప్పుడమ్మ అమ్మోరి రూపంలో ఉండే దేవత ! పైనుంచే మనల్ని చూసి చల్లగా ఆశీర్వదిస్తూంటుంది. వెళ్దాం పద !" భుజంమీదికి యాది శవాన్నెత్తుకుని చిట్టచివరిసారిగా దేవికి నమస్కరించాడు. జనం అతన్ని వెర్రిగా చూడసాగేరు.

"మీరు నన్ను కాదుగానీ, దేవుడు, కులం, మతం పేరిట మీరు బ్రతుకుతున్న పాపపంకిలమైన బ్రతుకును నేనే వెలివేస్తున్నాను ! మానవత్వంలేని మీమీది అసహ్యంతో నేనే దూరంగా పోతున్నాను. నేను నిత్యం కొలిచే నా దైవం ఇకమీదట నాకీ పసివాడిలో కనిపిస్తుంది, నిస్సహాయుడైన వీడి తండ్రిలో కనిపిస్తుంది... ఇలాటి కోట్లాది అభాగ్యుల్లో కనిపిస్తుంది." అనేసి పసివాణ్ణి నడిపించుకుంటూ, యాది శవంతో సహా మెట్లు దిగసాగేడు వంశీ.

ఒక్కో మెట్టే దిగుతూంటే చీకటి మరింత దట్టమయిపోతూంది. అతనికి మాత్రం ఏమాత్రం అధైర్యంగా లేదు ! ఈ రాత్రి ఎంతోసేపుండదనీ, ప్రత్యూష వెలుగులు రాక మానవనీ అతనికి తెలుసు ! అతనిలో కొత్త శక్తి నిండింది. అతని మనసులో "కొత్త వెలుగు" వ్యాపించింది. ఇప్పుడతనికి ప్రపంచం యావత్తూ తను కొలిచే అమ్మవారే కనిపిస్తూంది. చేతులు చాపి రమ్మంటూంది. కర్తవ్యాన్ని గుర్తు చేస్తూంది... క్రమంగా అతని నడక వేగం హెచ్చింది.

కళ

స్పందించే
హృదయం
వున్నచోట
కళ విలువ
నిలుస్తుంది !
పెరుగుతుంది !
పశువు ముందు
ఎన్ని బొమ్మలుంచినా
నమిలి
మింగుతుందేగానీ
చూసి
ఆనందించలేదు !

— "సింహం"